
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ; 11 ; జనవరి ; 2025



సోమశిలలో 71.097 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 71.097 టీఎంసీలు ఉన్నాయి. 1931 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2,650, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.80,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,295
3 శాతం జీఎస్టీతో	రూ.7,514
నవర (8 గ్రా)	రూ.60,112

గరిష్టం/కనిష్టం
29.3 /22.0

వాతావరణం

జిల్లాలో శనివారం తేమ వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 76 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కారుణ్య నియామకాలు



కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు పొందిన వారితో కలెక్టరేట్ డీఆర్వో, ఏఓ

నెల్లూరు(అర్బన్): విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు ముగ్గురికి కలెక్టర్ ఆనంద్ కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్ ఉద్యోగాలు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందించారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా ఉంటూ మృతి చెందిన ఎం.ధనుంజయ కుమారుడు ఎం.హరికృష్ణకు, షేక్ ఇలియాజ్ కుమార్తె జాస్మిన్‌కు రెవెన్యూ శాఖలో ఉద్యోగం కల్పించారు. రెవెన్యూ విభాగంలో పనిచేస్తూ మృతి చెందిన ఎస్.మస్తానయ్య కుమారుడు మనోజ్‌సాయికుమార్‌కు అదేశాఖలో ఉద్యోగం కల్పించారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు ఉద్యోగాలు పొందిన వారికి అభినందనలు తెలిపారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి వారి మన్ననలు అందుకోవాలని కోరారు.

వెంకటశేషయ్యకు బెయిల్ మంజూరు



మందల వెంకటశేషయ్య

వెంకటాచలం: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. గత నెల 23వ తేదీన వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో వెంకటశేషయ్యపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడంతో న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా 6వ అదనపు జడ్జి అనుమతిస్తూ బెయిల్ మంజూరు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వెంకటశేషయ్య కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ బస్సులకు అనుమతులిస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంతో పాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో ప్రైవేట్ బస్సులు నడిపేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతులిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రవాణాశాఖాధికారులు, ప్రైవేట్ బస్సుల యజమానులతో సమావేశం జరిగింది. ఇప్పటికే నగరంతో పాటు ఇతర ప్రాంతాల్లో బస్సులు నడిపేందుకు ప్రైవేట్ ఆపరేటర్లు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా రవాణా శాఖ (ఆర్‌టీసీ) లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేసి ప్రైవేట్ ఆపరేటర్లకు అనుమతులివ్వాలని రవాణాశాఖాధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంతో పాటు రూరల్ పరిధిలో ఇప్పటికే అనుమతి ఉన్న 7 రూట్లలో, నూతనంగా అనుమతి కోరిన మరో 7 రూట్లలో ప్రైవేట్ బస్సులను నడుపుకునేందుకు పంపిన దరఖాస్తులను ఆమోదిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆర్టీసీ కూడా ప్రైవేట్ యాజమాన్యాలతో పోటీగా నగరంలో సిటీ బస్సులను నడపాలని కోరారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ చందర్, ఆర్టీఓ సిరిచందన, జిల్లా ప్రజారవాణాధికారి మురళీబాబు, పలువురు రవాణా, ప్రజారవాణా శాఖల అధికారులు, దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): జిల్లాలో కొత్తగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలనుకునే వారు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అఫిలియేషన్ రెన్యూవల్, అడిషనల్ సెక్షన్లు, కోర్సులు, షిఫ్టింగ్, పేరు, తదితర ప్రక్రియలకు సంబంధించి వచ్చే నెల ఫిబ్రవరి 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించామని, ఆయా రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌ను సరిచూసుకోవాలన్నారు.



స్వామివారికి ప్రణమిల్లుతున్న భక్తురాలు



శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి



మాగుంట లేఅవుట్‌లోని ఆలయంలో వెంకటేశ్వరస్వామి

వైకుంఠ వాసా.. గోవిందా గోవిందా..

నామస్మరణతో పరవశించిన సింహపురి

- వైష్ణవ క్షేత్రాల్లో బారులు తీరిన భక్తులు
- తల్పగిరీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



మాగుంట లేఅవుట్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



రంగనాథస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

నెల్లూరు (బృందావనం): వైకుంఠ ఏకాదశి విశిష్ట పర్వదినాన సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారని, కోటి తీర్థాల పుణ్యఫలం లభిస్తుందని వేదపురాణాలు చెబుతున్న నేపథ్యంలో శుక్రవారం సింహపురి గోవింద నామస్మరణతో పులకించింది. నగరంలోని కొలువైన వైష్ణవ క్షేత్రాలతోపాటు పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి)ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైష్ణవాలయాల్లో వివిధ రూపాల్లో కొలువైన శ్రీవారు భక్తులకు వైకుంఠ ద్వారంలో దివ్య దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు తరలి వచ్చిన అశేష భక్తజనంతో ఆలయాలు కిటకిటలాడాయి. రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి, మూలాపేటలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయాలతోపాటు నగరంలోని వైష్ణవాలయాల్లో భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు గోవిందనామాలతో ఆధ్యాత్మిక వైభవం పరిఢవిల్లింది. సింహపురి క్షేత్రపాలకుడిగా పవిత్ర పినాకిని తీరాన కొలువైన తల్పగిరి రంగనాథుడు ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా కొలువై శుక్రవారం వేకువ జామున 4.30 గంటలకు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు, ఈ దొరస్వామి తదితరుల ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా అర్ధరాత్రి 12 గంటల నుంచి దర్శన సమయం వరకు ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. ఉత్తరద్వారం నుంచి విచ్చేసిన స్వామి వారికి సంప్రదాయంగా ప్రాకారోత్సవం విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీతల్పగిరి రంగనాథస్వామివారికి రాపత్తు మండపంలో ఐదు చుట్లు ఉత్సవం నిర్వహించారు. అనంతరం అలంకారమండపంలో స్వామివారిని ఉన్నతంగా వేంచేపు చేశారు. తదుపరి 4.30 గంటల నుంచి భక్తులకు విశేషాలంకారంలో కొలువైన మూలవర్లను దర్శనం కలిగించారు. దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం భక్తిపారవశ్యంతో తల్పగిరీశా శరణు శరణు.. జయజయ రంగనాథా.. నమో వైకుంఠవాసా.. గోవిందా గోవింద అంటూ పులకించి, పరవశించారు. శుక్రవారం రాత్రి రాపత్తు ఉత్సవం ఆళ్వార్ల గోష్ఠిగా వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ద్వారదర్శనం ఉభయకర్తలుగా ఆనం వెంకటరెడ్డి, వెంకటరమణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు, పాలపర్తి ఆండాళమ్మ ఎండోమెంట్ తరఫున కంచర్ల ఠాగూర్‌నాథ్, కిశోర్‌నాథ్ వ్యవహరించారు.



కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి

మూలవర్లకు విశేష పూలంగిసేవ

మూలవర్లు విశేష పుష్పాలంకరణలో భక్తులకు నామధారిగా దివ్య దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రాంగణంలో కొలువై ఉన్న తాయార్లు, ఆండాళ్‌తాయార్లు, ప్రసన్నవెంకటేశ్వరస్వామి వారికి పూలంగి సేవలు నయనానందకరంగా నిర్వహించారు. ఆయా సేవల ఉభయకర్తలుగా చుండూరు వసుంధరమ్మ, రౌతు నరసింహారావు, గుండ్లపల్లి మాల్యాద్రి అంబరీష్, మాధవి, వేళ్ల హరిబాబునాయుడు, బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, స్నేహలతారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను దేవదాయశాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచి కంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

అరిసెలు.. నోస్టాక్

- పండగ వరకు సరఫరా చేయలేమంటున్న యజమానులు
- స్వీట్ షాపుల్లో డిమాండ్‌కు తగినట్లు లేని తయారీ



నవాబుపేట ఏరియాలోని స్వీట్ షాపులో అరిసెలు తయారు చేస్తున్న మహిళలు



అరిసెలు లేవంటూ నో స్టాక్ బోర్డు పెట్టిన దృశ్యం

నెల్లూరు (పొగతోట): సంక్రాంతి పండగ ప్రత్యేక సంప్రదాయ పిండి వంట అరిసెలు. తరతరాలుగా ఏడాదిలో వచ్చే పండగల్లో అరిసెలు ఒక్క సంక్రాంతి పండగలకే చేయడం ఆనవాయితీగా వస్తోంది. పల్లెల్లో సంప్రదాయ అరిసెల నుంచి ఇతర రకాల పిండి వంటల తయారీ చేసుకుంటున్నారు. నగరాలు, పట్టణాల్లో మాత్రం చేయడం వీలు కాకపోవడం, తయారీ అనుభవం లేకపోవడంతో స్వీట్స్ షాపుల మీద ఆధార పడుతున్న పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. గతంలో స్వీట్ షాపుల్లో అరిసెలు తయారీ ఉండేది కాదు.. ఎప్పుడైతే నగర వాసుల నుంచి డిమాండ్ ఏర్పడిందో.. అప్పటి నుంచి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సంవత్సరం పొడుగునా అరిసెలు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది స్వీటు షాపుల్లో అరిసెలతోపాటు కజ్జికాయలు, మనుబూలు, బూరెలు, లడ్డూలు తదితర సంప్రదాయ వంటలను చేసి విక్రయిస్తున్నారు.

తయారీలో పాకప్రావీణ్యం ఉండాలి..

సంక్రాంతి పండగలో అరిసెలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అటువంటి అరిసెల తయారు చేయడంలో పాక ప్రావీణ్యం ఉండాలి. ఇప్పటి తరానికి ఆ ప్రావీణ్యం తక్కువే. నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, టెక్కేమిట్ట, బీవీనగర్, మూలాపేట తదితర ప్రాంతాల్లో అరిసెలు తయారు చేస్తున్నారు. నగర వాసుల నుంచి పల్లె వాసుల వరకు స్వీట్స్ షాపులపై ఆధార పడుతుండడంతో అధిక డిమాండ్ ఏర్పడింది. అందుకు తగినట్లు అరిసెలు తయారు చేయలేక స్వీట్ షాపుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టారు. పండగ వరకు అరిసెలు అడగవద్దంటూ వచ్చిన కస్టమర్లకు చెబుతున్నారు. ఆర్డర్లు కూడా తీసుకోవడం లేదు. నగరంలో అరిసెలు తయారు చేసే దుకాణాల్లో అధిక శాతం మంది మహిళలు గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారే. కేజీకి చిన్నవి అయితే 40కి పైగా అరిసెలు వస్తాయి. నవాబుపేటలో చేస్తున్న అరిసెలు కేజీకి 15 వస్తున్నాయి. కేజీల వంతున కాకుండా పీస్ రూ.10 వంతున దుకాణ యజమానులు విక్రయిస్తున్నారు. పండగ వరకు ఆర్డర్లు తీసుకున్నాము. వారికి ఇవ్వడానికే సమయం సరిపోవడం లేదంటూ యజమానులు సారీ చెబుతున్నారు.

అపార్ట్‌మెంట్లలో ప్రత్యేకం

నగర ప్రాంతాల్లో అపార్ట్‌మెంటు కల్చర్ పెరిగిపోయింది. నెల్లూరులో అధిక శాతం అపార్ట్‌మెంట్లు వెలిశాయి. సంక్రాంతి పండగ రావడంతో సంప్రదాయ పిండి వంటల కోసం అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న వారందరూ ఒకటవుతున్నారు. అరిసెలు, మనుబూలు, ఇతర సంప్రదాయ పిండి వంటలు తయారు చేసే వారిని గ్రామీణ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. వారు రెండు రోజుల పాటు నివాసం ఉండేందుకు వసతి కల్పించి అధిక మొత్తంలో నగదు చెల్లించి పిండి వంటలు తయారు చేయించుకుంటున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అగ్రశ్రేణి కంపెనీల్లో 12 నెలల పాటు పరిశ్రమల అనుభవం కల్పించనున్నామన్నారు. ప్రతి నెలా రూ.6 వేలు గ్రాంట్‌గా అందజేస్తామన్నారు. పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు అర్హులన్నారు. 21 నుంచి 24 ఏళ్ల లోపు యువతి, యువకులు ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8074634065, 7780750871 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వనం నుంచి జనంలోకి..

జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నట్లుగానే వన్య సంరక్షణ చట్టం ప్రకారం అడవి జంతువులకు స్వేచ్ఛగా జీవించే హక్కు కూడా ప్రభుత్వం కల్పించింది. అయితే ఇటీవలి కాలంలో అడవి విస్తీర్ణం తగ్గుతుండడం, ఆ ప్రాంతాల్లో తాగునీటి వసతి తగ్గడంతో దాహార్తి తీర్చుకొనేందుకు పలు మూగ జీవులు జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి.



- దాహార్తి తీర్చుకునేందుకు వస్తున్న వన్యప్రాణులు
- రోడ్డుపై వాహనాలు ఢీకొని కొన్ని..
- కుక్కల దాడిలో మరికొన్ని బలి
- సంరక్షణ చర్యలు అత్యవసరం





నెల్లూరు - ముంబయి రహదారికి సమీపంలో వెలుగొండ అడవిలో సంచరిస్తున్న పులులు (ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలో పెంచలకోన, ఉదయగిరి ప్రాంతాలను కలుపుకొని 1.57 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. పెంచలకోన అభయారణ్యంలో చిరుతలు ఉన్న విషయం తెలిసిందే. అప్పుడప్పుడు ఆహారం, తాగునీటి కోసం అవి జనారణ్యంలోకి కూడా వస్తున్నాయి. చుక్కల దుప్పిలు, జింకలు లాంటి మూగజీవాలు కూడా దాహార్తి తీర్చుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లోకి వచ్చి కుక్కల దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. నాలుగు నెలల వ్యవధిలో మర్రిపాడు, అనంతసాగరం, సంగం మండలాల పరిధిలో 8 జంతువులు ఇలా జనారణ్యంలోకి వచ్చి మూడు ప్రాణాలు కోల్పోగా, ఐదింటిని ఆయా గ్రామస్తులు కాపాడి అటవీ శాఖ అధికారుల సహకారంతో తిరిగి అడవుల్లో వదిలేశారు.

- నాలుగు నెలల క్రితం బద్వేల్ నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారుపై కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు - ముంబై రహదారిలో చిరుతపులి దాడి చేయడంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. దాడికి పాల్పడిన జంతువు పరారైంది.
- అనంతరం కొద్ది రోజులకు కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలోనే అడవుల్లో సంచరించే బేస్ క్యాంపు సిబ్బందిపై రెండు ఎలుగుబంట్లు దాడికి పాల్పడ్డాయి. సిబ్బంది అప్రమత్తం కావడంతో అవి పారిపోయాయి. ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.



పడమటినాయుడుపల్లి శివార్లలో కుక్కల దాడిలో మృతి చెందిన చుక్కల దుప్పి (ఫైల్)



పీఎస్‌పల్లి శివారు పొలాల్లో నేలబావిలో చిక్కుకున్న జింక పిల్ల (ఫైల్)

- రెండు నెలల క్రితం పడమటినాయుడుపల్లి గ్రామ శివారు మాగాణి పొలాల్లో దాహార్తి తీర్చుకొనేందుకు వచ్చిన చుక్కల దుప్పి నేల బావిలో పడింది. సమీపంలోని రైతులు గమనించి అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు దానిని రక్షించి తిరిగి అడవిలోకి వదిలేశారు.
- మరో సంఘటనలో పడమటినాయుడుపల్లి గ్రామంలోకి దాహార్తి తీర్చుకొనేందుకు వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాతపడింది.
- అనంతసాగరం మండలం మంచాలపల్లి గ్రామంలోకి వచ్చిన చుక్కలదుప్పి రోడ్డు దాటుతూ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మూడు నెలల క్రితం జరిగింది.

సంరక్షణకు చర్యలు

వన్యప్రాణులు జనారణ్యంలోకి వచ్చి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణకు మా సిబ్బంది నిత్యం కృషి చేస్తున్నారు. అటవీ ప్రాంతం సమీపంలో నిర్మిస్తున్న రోడ్లపై జంతువులు సంచరించేందుకు వీలుగా ఫ్లై ఓవర్లు నిర్మించాలని ఆయా శాఖల అధికారులకు సూచించాం. అడవుల్లో జంతువుల దాహం తీరేందుకు పలుచోట్ల నీటి తొట్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అనుకోని పరిస్థితుల్లో వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తే వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలి.

– మహబూబ్ బాషా, డీఎఫ్ఓ

మానవత్వంతో వ్యవహరించాలి



ఇటీవల కాలంలో అడవుల విస్తీర్ణం తగ్గుతుండడం, అడవిలో తాగునీటి వనరులు తగ్గిపోవడంతో పలు జంతువులు రోడ్లపైకి వస్తున్నాయి. ఇలా వస్తున్న జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించి వాటిని కాపాడాలి. నా వంతుగా ప్రతి ఏటా వేసవి నాలుగు నెలల పాటు నెల్లూరు – ముంబయి రహదారికి సమీపంలోని అటవీ ప్రాంతంలో కొంత లోపలి వైపునకు ట్యాంకర్‌తో నీళ్లు తీసుకువెళ్లి తొట్టెల్లో నింపిస్తున్నాను.

– డి.శ్రీలత, పంచాయతీ కార్యదర్శి, మర్రిపాడు

సంరక్షణ మన బాధ్యత



ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంత మేర అడవి జంతువుల పట్ల దయతో వ్యవహరించాలి. దారి తప్పి అడవి సమీప గ్రామాల్లోకి వస్తే వాటిని కాపాడి అటవీ శాఖ అధికారులకు తెలిపి తిరిగి అడవిలోకి వదిలేలా సహకరించాలి. నా వంతుగా మా గ్రామ సమీపంలోకి వచ్చిన అడవి దుప్పులు, జింకలను కుక్కలబారిన పడకుండా రక్షించి పలుమార్లు తిరిగి అడవి ప్రాంతంలోకి పలువురి సహకారంతో వదిలేశా. జంతువుల సంరక్షణకు అందరూ కృషి చేయాలి. – మదుపూరు సుబ్బారాయుడు, జంతు ప్రేమికుడు, మర్రిపాడు

పండగకెళ్లొస్తాం..


బస్సొచ్చాక ముందే ఎక్కేయాలి


కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్టాండ్


బస్సెక్కేందుకు పాట్లు


ట్రైమైపోతోంది..


స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధంగా..


బ్యాగులను ఆటో నుంచి దింపుకొంటూ..



సీటు కోసం తగ్గేదేలే..

చదువులతో నిరంతరం కుస్తీ పడే విద్యార్థులు.. సంక్రాంతి పండగను తమ కుటుంబసభ్యులతో జరుపుకొనేందుకు సన్నద్ధమయ్యారు. పండగ సందర్భంగా సెలవులను ప్రకటించడంతో తమ సొంతూళ్లకు వెళ్లేందుకు ఉపక్రమించారు. భారీగా తరలిరావడంతో నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ శుక్రవారం కిటకిటలాడింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

పక్కాగా కుష్టు వ్యాధి సర్వే


మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): కుష్టు వ్యాధిపై జిల్లాలో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి రెండు వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా లెప్రసీ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, నోడల్ అధికారులకు నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్, వలంటీర్‌తో టీమ్‌ను ఏర్పాటు చేసి వారితో ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. వ్యాధికి సంబంధించిన ప్రాథమిక లక్షణాలు ఎలా ఉంటాయో తెలియజేసి, అనుమానితులను సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించాలని కోరారు. జిల్లాలో 1879 టీమ్‌లతో చేపడుతున్న సర్వేను విజయవంతం చేయాలని చెప్పారు. డాక్టర్ సురేంద్ర, డీఎఫ్ఐటీ అధికారి సతీష్, డాక్టర్ సునీత, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా నిమ్మ ధరలు

- తోటల్లో పూతలేక రైతుల దిగాలు


మార్కెట్‌కు వచ్చిన నిమ్మ కాయలు

పొదలకూరు: చలి తీవ్రతతో నిమ్మ వాడకం తగ్గుముఖం పట్టింది. ధరలు దిగజారకపోయినా, పెరగడం లేదు. సాధారణంగా జనవరి నుంచి నిమ్మ ధరలు మెల్లగా పెరుగుతుంటాయి. ప్రస్తుతం కిలో రూ.24 నుంచి రూ.29 వరకు పలుకుతోంది. నాణ్యత కలిగిన కాయలకే ఈ ధరలు వర్తిస్తాయని వ్యాపారులు వెల్లడించారు. మరోవైపు మంచు ప్రభావంతో కాయల్లో నాణ్యత లోపించి రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. సంక్రాంతి వరకు తోటలకు నీరు పెట్టే అవసరం లేకుండా వర్షం కురిసిందని అన్నదాతలు తెలిపారు. గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు జడివానలు, ముసురు ప్రభావంతో తోటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా సీజన్లో కాయల దిగుబడి ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం


పరిశీలిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని కనిసిరిపాళెం లారీ కాటా ఎదురుగా డొంకలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. దీనిపై పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 70 ఏళ్ల ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలను మేమే జరిపిస్తాం

ఇంకెవరైనా నిర్వహిస్తే ఊరుకోం

- లోకేశ్ అనుచరుడి అల్టిమేటం
- రామాయపట్నంలో జరిపేందుకు ఏర్పాట్లు..?



ఉలవపాడు: కోడిపందేలను మేమే జరుపుతాం.. అందరూ ఇక్కడికే వచ్చి పందేలు వేయాలి... మాకు తెలియకుండా ఇంకెవరైనా నిర్వహిస్తే ఊరుకునేది లేదని మంగళగిరి ప్రాంతానికి చెందిన లోకేశ్ అనుచరుడు స్థానిక తీరప్రాంత గ్రామాల నేతలకు చెప్పారని సమాచారం. ఇది ఆ నోటా ఈ నోటా అందరికీ తెలిసిపోయింది. రామాయపట్నంలోని రిసార్ట్స్‌లో బార్ అండ్ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్న వ్యక్తే వీటిని జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం.

లోకేశ్ అనుచరుల నిర్వహణ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రామాయపట్నంలోని రిసార్ట్స్, బార్ అండ్ రెస్టారెంట్‌ను మంగళగిరిలోని లోకేశ్ అనుచరులు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు పందేలను నిర్వహించనున్నారని స్థానిక నేతలకు తెలియజేశారు. గతంలో ఈ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా వీటిని నిర్వహించేవారు. మత్స్యకార గ్రామాలు, అటవీ ప్రాంతం కావడంతో దాడులను పోలీసులు తక్కువగా నిర్వహించేవారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు పరోక్ష సహకారం అందించారనే ఆరోపణలూ ఉన్నాయి. ఈ తరహాలో గతంలో కోడిపందేలను నిర్వహించిన వారందర్నీ పిలిచి మీరెవరూ ఇక్కడ చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారని సమాచారం.

పోలీస్‌స్టేషన్‌ను ఆనుకొనే..

రిసార్ట్స్ సమీపంలోని ఖాళీ స్థలంలో మూడు బరులను ఏర్పాటు చేసి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారని సదరు నిర్వాహకులే పాత నిర్వాహకులకు తెలిపారని సమాచారం. మరోవైపు పందేలను నిర్వహిస్తున్నామని చెప్తున్న ప్రాంతం మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను ఆనుకొని ఉంది. ఇక్కడ ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు. అయినా నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలుంటాయని ఓ వైపు పోలీస్ శాఖ చెప్తున్నా, వీరు మాత్రం నిర్వహించాలని నిర్ణయించడం గమనార్హం. ఈ వాతావరణం ఇలాగే కొనసాగితే ఎలా అని తీరప్రాంత గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోవైపు డైమండ్ డబ్బా ఆడించేందుకు వారి వద్ద నుంచి నిర్వాహకులు డబ్బులు వసూలు చేశారనే చర్చా సాగుతోంది. దీనిపై పోలీస్ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

కుమారుడ్ని అత్త మందలించారనే మనస్తాపంతో..

- తల్లి బలవన్మరణం

నెల్లూరు సిటీ: కుమారుడ్ని అత్త మందలించారనే మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని కోటమిట్ట ఎర్ర దర్గా వద్ద నివాసం ఉంటున్న నజీర్, షమీమ్ దంపతుల కుమార్తె రుబీనా (22)కు మూడేళ్ల క్రితం అంజద్‌తో వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. దంపతులు అన్యోన్యంగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోఫాపై రుబీనా రెండేళ్ల కుమారుడు మూత్రం పోశారు. దీంతో బాలుడ్ని అత్త గౌసున్నీసా మందలించారు. ఈ పరిణామంతో రుబీనా తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పాల ప్యాకెట్ కోసం భర్త శుక్రవారం ఉదయం బయటకెళ్లిన సమయంలో తన రూమ్‌కెళ్లి తలుపులకు గడి వేసుకొని చీరతో ఉరేసుకున్నారు. తిరిగొచ్చిన అనంతరం తలుపులు తట్టినా తీయకపోవడంతో కిటికీ అద్దాలను పగలగొట్టి భర్త చూడగా, ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించారు. దీంతో తలుపులను పగలగొట్టి హాస్పిటల్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. రుబీనా తల్లి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): గుంటూరు జిల్లా పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యుడు ప్రకాశ్‌రావుపై పొన్నూరు సీఐ, ఎస్సై అప్రజాస్వామిక, అమానుష చర్యలకు నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బహిష్కరించారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ.29
సన్నవి: రూ.23
పండ్లు: రూ.12

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తూరులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సైలు జిలానీ, సాయిప్రసాద్ వివరాల మేరకు.. అప్పారావుపాళెంలోని దళితకాలనీకి చెందిన ఉదయగిరి జశ్వంత్ (15) గ్రామంలోని హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. పాఠశాలకు సెలవులివ్వడంతో మరో మిత్రుడితో కలిసి బైక్‌పై ఆత్మకూరు బయల్దేరారు. ఈ క్రమంలో ట్రాక్టర్ నుంచి సైడ్ తీసుకునే క్రమంలో ఎదురుగా మరో బైక్ వచ్చింది. దీంతో ట్రాక్టర్ తగిలి జశ్వంత్, మిత్రుడు కిందపడ్డారు. జశ్వంత్ తలపై ట్రాక్టర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్‌తో సహా డ్రైవర్ పరారయ్యారు. కాగా జశ్వంత్ తండ్రి మూడేళ్ల క్రితం ఆత్మహత్యకు పాల్పడటంతో తల్లి సంపూర్ణమ్మ కూలీ పనులు చేస్తూ కుమారుడ్ని చదివించుకుంటున్నారు. కుమారుడు మృతి చెందడంతో ఆమె గుండెలవిసేలా రోదించారు. ఘటన స్థలానికి ఎస్సైలు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డే ఓబన్న జయంతి నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండగగా జరిపేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకటలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జయంతి కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని చెప్పారు.

నాణ్యమైన విద్యను బోధించాలి


మాట్లాడుతున్న దినేష్ ప్రసాద్

నెల్లూరు (టౌన్): ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దినేష్ ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్సీఈఆర్టీలో దక్షిణాది రాష్ట్రాల డైట్ కళాశాలల అధ్యాపకులకు పాఠ్య పుస్తకాలపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ నూతన విద్యా విధానంతో ఎన్నో మార్పులొస్తాయని చెప్పారు. ఇందులో భాగంగా 1, 2, 3, 6వ తరగతులకు కొత్త పాఠ్య పుస్తకాలను ముద్రించారని తెలిపారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని కోరారు. వివిధ కారణాలతో చదువును మధ్యలో మానేసిన వారికి సైతం కొత్త విద్యా విధానంలో విద్యను కొనసాగించే అవకాశం ఉందన్నారు. వెంకటాచలం మండలంలోని చవటపాళెంలో ఎన్సీఈఆర్టీ భవనాన్ని రూ.500 కోట్లతో నిర్మిస్తున్నారని, ఇది రెండేళ్లలో పూర్తికానుందని వెల్లడించారు. అనంతరం వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు మాట్లాడారు. నెల్లూరులో కేంద్ర ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు రంజన, అరోరా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ విజయన్, ఓఎస్డీ రమేష్‌బాబు, ఆర్ఐఈ మైసూరు ప్రిన్సిపల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత



కోవూరు: చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలపై కోవూరు పోలీసులు దాడులను శుక్రవారం నిర్వహించారు. పడుగుపాడులోని శివాలయ సమీపంలో వెళ్తున్న చికెన్ వేస్ట్ వాహనాలను పట్టుకున్నారు. అనంతరం గుంతల్లో వీటిని పూడ్చిపెట్టారు.

గణతంత్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు రూరల్: గణతంత్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే శకటాలను ప్రదర్శించాలని సూచించారు. పోలీస్, సాయుధ దళాలు, ఎన్‌సీసీ సంయుక్తంగా కృషి చేసి కవాతు ప్రదర్శనలివ్వాలని కోరారు. విద్యుత్‌కు అంతరాయం తలెత్తకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేలా విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. కమిషనర్ సూర్యతేజ, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీఓ అనూష, డీఈఓ బాలాజీరావు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డీఆర్డీఏ, హౌసింగ్, ఏపీఎంఐపీ పీడీలు నాగరాజ కుమారి, వేణుగోపాల్, శ్రీనివాసులు, డీటీసీ చందర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	120
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	218
బ్రాయిలర్ స్కిన్‌లెస్	240
లేయర్ చికెన్	145